క్లుప్తంగా

ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు



ట్రాఫిక్ సమస్యను నియంత్రిస్తున్న సీఐ నారాయణరావు

సాక్షి ఎఫెక్ట్...

రామభద్రపురం: ట్రాఫిక్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని సీఐ కె.నారాయణరావు తెలిపారు. సంక్రాంతి పండగ వేళ మండల కేంద్రంలో తరచూ నెలకొనే ట్రాఫిక్ సమస్య జటిలం కాకుండా ఏర్పాటు చేసిన పోలీసులు.. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోకుండా ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారన్న అంశంపై ఆదివారం సాక్షి దినపత్రికలో ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు ప్రేక్షకపాత్ర పేరిట వార్తా కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన సీఐ.. ఆయనే స్వయంగా రంగంలోకి దిగి సోమవారం ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని ఆయన అన్నారు.

డ్రగ్స్ షార్ట్‌ఫిల్మ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

బొబ్బిలి: స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డ్రగ్స్ షార్ట్‌ఫిల్మ్‌కు సంబంధించిన పోస్టర్‌ను డీఎస్పీ పి.శ్రీనివాసరావు సోమవారం ఆవిష్కరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనే ప్రధానాంశంగా డ్రగ్స్.. ఇంపాక్ట్ ఆన్ సొసైటీ(సమాజంపై దాని ప్రభావం) పేరుతో రూపుదిద్దుకుంటున్న ఈ లఘు చిత్రం ద్వారా డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీఐ కె.సతీష్‌కుమార్, ఎక్సైజ్ సీఐ పి.చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుర్లంకికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న శ్రీనివాసరావు

రాజాం సిటీ: పట్టణానికి చెందిన అనూరాధ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గర్లంకి శ్రీనివాసరావుకు చెన్నై అన్నామలై భవన్‌లో జరిగిన స్నాతకోత్సవంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. ఇరవై ఏళ్లుగా ఆయన విద్యారంగంలో అందించిన సేవలకు గాను ఫోరిడా గ్లోబల్ హ్యూమన్ పీస్ వర్సిటీ వారు ఈ నెల 12వ తేదీన డాక్టరేట్ ఇచ్చినట్లు ఆయన సోమవారం తెలిపారు. ఆయనకు డాక్టరేట్ రావడం పట్ల పట్టణానికి చెందిన పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

అధ్వానంగా రోడ్లు.. జనం అవస్థలు!

రోడ్లు అధ్వానంగా ఉండడంతో జనం అవస్థలు పడుతున్నారు. ఎక్కడ ఏ రోడ్డు చూసినా మరమ్మతులకు గురై ప్రమాదకరంగా కనిపిస్తోంది. అడుగుకో గుంత.. గజానికో గొయ్యి.. మాదిరి కనిపిస్తోంది. గుంతలమయమైన రోడ్డు ఓ చోట, చిన్నపాటి వర్షానికి బురదమయమైన రోడ్డు మరోచోట, రాళ్లు తేలిన రోడ్డు ఇంకోచోట దర్శనమిస్తున్నాయి. సంక్రాంతి పండగకు స్వగ్రామం బాటపడుతున్న వలసదారులు ఇంకా రోడ్లు బాగు చేయలేదా అని ప్రభుత్వంపై మండిపడుతున్నారు. మరోవైపు నిత్యం రాకపోకలు సాగించేవారు రోడ్లలో ఎగసిపడుతున్న దుమ్మూధూళితో ఊపిరితిత్తులు దెబ్బ తింటున్నాయని, వాహనాలు సైతం పాడవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా గర్భిణులను ఆస్పత్రికి తీసుకువెళ్లాలంటే నరకయాతన పడుతున్నామని వాపోతున్నారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్

తెర్లాం: రాళ్లు తేలిన నందిగాం-కుసుమూరు తారురోడ్డు





రాజాం: కొరాలిపురం-బొద్దాం గ్రామాల మధ్య రాళ్లుతేలిన రోడ్డు



వంగర: మరమ్మతులకు గురైన బాగెంపేట రోడ్డు



తెర్లాం: అస్తవ్యస్తంగా సతివాడ నుంచి నెమలాం వెళ్లే రోడ్డు



తెర్లాం: గోతులమయమైన సింగిరెడ్డి వలస-నెమలాం మెటల్ రోడ్డు



తెర్లాం: బురదమయమైన ఉద్దవోలు నుంచి గడ్డిముడిదాం వెళ్లే రోడ్డు



అధ్వానంగా బొబ్బిలిలోని గొల్లపల్లి బైపాస్ రోడ్డు



రేగిడి: గోతులమయంగా ఖండ్యాం-సోమరాజుపేట రోడ్డు



బొబ్బిలి: రాజాం-రామభద్రపురం రోడ్డులో మర్రివలస దాటిన తర్వాత రోడ్డు దుస్థితి



తెర్లాం: గుంతలమయమైన ఎం.ఆర్.అగ్రహారం-ఉత్తరావెల్లి మధ్య బీటీ రోడ్డు



బాడంగి: పాడైన బాడంగి మెయిన్‌రోడ్డు



రాజాం సిటీ: మరమ్మతులకు నోచుకోని రాజాం ప్రధాన రహదారి

నిరుపేదలకు వస్త్రదానం



రాజాం: పేదలకు నూతన వస్త్రాలు అందజేస్తున్న కృష్ణార్జున కుటుంబ సభ్యులు



తెర్లాం: విజయరాంపురంలో నిరుపేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజాం/రేగిడి/వంగర/తెర్లాం: సంక్రాంతి పండగ పురస్కరించుకుని, మండలాల్లోని పలు గ్రామాల్లో నిరుపేదలకు దాతలు సోమవారం వస్త్రదానం చేశారు. రాజాం మండలంలోని కంచరాం వద్ద జేఏలికే టైల్స్ ఎండీ ఏవీఎస్ఎస్ కృష్ణార్జున మొత్తం 1000 మందికి చీరలు, దుప్పట్లు అందజేశారు. తన తండ్రి ఏవీ జగన్నాథరావు పట్నాయక్ జ్ఞాపకార్థం వాటిని అందజేసినట్లు ఆయన తెలిపారు. భోగి పండగ సందర్భంగా రేగిడి మండలంలోని వావిలవలస గ్రామ చిరువ్యాపారి వారణాసి జగన్నాథస్వామి ఆ గ్రామంలోని పలువురు పేదలకు దుస్తులు పంచిపెట్టారు. అమృతం కలశం పేరిట వంగర మండలంలోని కొప్పరవలస గ్రామంలోని 22 మంది పేదలకు దాతలు దుస్తులు, నెలరోజులకు సరిపడ నిత్యావసర సరుకులు వితరణ చేశారు. రాజాం మండలంలోని పొనుగుటివలస గ్రామ విశ్రాంత వ్యవసాయాధికారి ఎస్వీ రమణ.. ఆ గ్రామంలోని 400 మంది పేదలకు చీరలు, దుప్పట్లు దానం చేశారు. తెర్లాం మండలంలోని విజయరాంపురంలో స్వామి వివేకానంద ట్రస్టు ఆధ్వర్యంలో 300 మంది పేదలకు దుప్పట్లు, చీరలు, లుంగీలు, టవళ్లు పంచిపెట్టారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

వంగర: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని, క్రీడల్లో రాణించిన ఎంతోమంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని యువత వారిని ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీటీసీ కిమిడి సన్యాసినాయుడు(తాతబాబు) అన్నారు. మండలంలోని కొప్పర గ్రామంలో మూడు రోజుల పాటు జరిగిన మండల స్థాయి వాలీబాల్ పోటీలు సోమవారంతో ముగిశాయి. సాయంత్రం జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన కొప్పర జట్లతో పాటు తృతీయ, నాలుగో స్థానాల్లో నిలిచిన నారాయణపురం, గీతనాపల్లి జట్లకు ట్రోఫీలు అందజేశారు.

రేగిడి: సంక్రాంతి సందర్భంగా మండలంలోని తునివాడ గ్రామంలో వాలీబాల్ పోటీలు సోమవారం నిర్వహించారు. మొత్తం ఆరు జట్లు ఈ పోటీల్లో పాల్గొనగా, ప్రథమ, ద్వితీయ స్థానాల్లో తునివాడ గ్రామ జట్లు నిలిచి, బహుమతులను కైవసం చేసుకున్నాయి. విజేతలకు క్రీడాదుస్తులు, మెడల్స్ అందజేశారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



డాక్టర్ తలే రాజేష్

రాజాం: ప్రజలందరికీ వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్.. సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఇదే విషయమై ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద సోమవారం మీడియాతో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలని, అందరూ సుఖసంతోషాలతో జీవితం గడపాలని ఆకాంక్షించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



బాడంగి ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

తెర్లాం/బాడంగి/రాజాంసిటీ: మండలాల్లోని పలు గ్రామాల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అట్టహాసంగా సోమవారం జరిగింది. తెర్లాం గౌతమ్ హైస్కూల్‌లో 2004–05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు, బాడంగి హైస్కూల్ 1999–2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు, రాజాం మండలంలోని డోలపేట ఉన్నత పాఠశాల 1999–2000 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా కలుసుకుని, ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సరదాగా గడిపారు. అనంతరం అప్పట్లో తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి, వారి పట్ల గౌరవభావం చాటుకున్నారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం



బొబ్బిలి: భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు పడేస్తున్న సీపీఐ నాయకుడు అప్పన్న తదితరులు



బొబ్బిలి: భోగి మంటలోకి విద్యుత్ బిల్లులు వేసి దహనం చేస్తున్న సీపీఎం నాయకుడు శంకరరావు తదితరులు



బాడంగి: చినభీమవరంలో భోగి మంటల్లోకి విద్యుత్ బిల్లులు విసిరేస్తున్న విద్యుత్ వినియోగదారులు



బొబ్బిలిరూరల్: ఎం.బూర్జివలసలో భోగి మంటలో విద్యుత్ బిల్లులు కాల్చివేస్తున్న సీపీఎం నాయకులు

ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వ్యతిరేకిస్తూ సీపీఐ, సీపీఎంల ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులు సోమవారం నిరసనకు దిగారు. భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేసి, సీఎం చంద్రబాబు తీరుపై మండిపడ్డారు. ఎన్నికల ప్రచార సమయంలో కరెంట్ చార్జీలు పెంచబోమని చెప్పి, ఎలా పెంచారని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి, సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పెనుభారం మోపారన్నారు. వ్యాపారవేత్త అదానీకి రూ.వేల కోట్లు అక్రమంగా దోచిపెట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ప్రయత్నాలు చేస్తుండడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా పెంచిన కరెంట్ చార్జీలు తగ్గించి, విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును నిలిపివేయాలని లేకపోతే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

– బొబ్బిలి, బొబ్బిలిరూరల్, బాడంగి

భోగభాగ్యాల భోగి



రాజాం: భోగి పండగలో వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ తదితరులు

వాడవాడలా భోగి పండగ సోమవారం ఘనంగా నిర్వహించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా ప్రతిఒక్కరూ భోగి మంట వద్దకు చేరుకుని, చలి కాగుతూ సరదాగా గడిపారు. తమ వెంట తీసుకువచ్చిన పాతవస్తువులతో పాటు పిడకలు, కర్రలను ఆ భోగి మంటలో పడేసి, అందరి జీవితాలు భోగభాగ్యాలతో వెల్లివిరియాలని భగవంతుడిని కోరుకున్నారు. అనంతరం భోగి స్నానాలు ఆచరించి, చిన్నారులపై భోగి పండ్లు పోశారు. ఏటా సంక్రాంతి ముందు రోజు ఈ భోగి వేడుక జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుండడం గమనార్హం.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



తెర్లాం రామమందిరం జంక్షన్ వద్ద వేసిన భోగి మంట



వంగర: కొప్పరలో భోగిమంట



బాడంగి మండల కేంద్రంలో వేసిన భోగి మంట



రేగిడి: వన్నలిలో భోగి మంట వద్ద చలి కాగుతున్న గ్రామస్తులు



బొబ్బిలి మెయిన్ రోడ్డులోని శ్రీకళాభారతి వద్ద వేసిన భోగి మంట వద్ద స్థానికులు



సంతకవిటి: బొద్దూరులో వేసిన భోగి మంట



రాజాం సిటీ: పెనుబాకలో భోగి మంట వద్ద జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు తదితరులు

సంక్షిప్తంగా..

మా భూమి మాకు ఇచ్చేయండి

బాడంగి: మా భూమి మాకు ఇవ్వాలని మండలంలోని పిన్నవలస గ్రామానికి చెందిన భార్యాభర్తలు వెంకటలక్ష్మి, శ్రీనివాసరావులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై వారు సోమవారం సాక్షి విలేకరులతో మాట్లాడుతూ రీసర్వే తర్వాత కోడూరు, బాడంగి రెవెన్యూ పరిధిలోని తమ భూమిలో కొంతభాగం లేనట్లు(భూ వివరాలు తక్కువగా) ఆన్‌లైన్‌లో చూపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాడంగి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 280/7లో 23 సెంట్లకు 21 సెంట్లు, సర్వే నంబరు 281/4లో 30 సెంట్లకు 28 సెంట్లు, కోడూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 8/6లో 97 సెంట్లకు గాను 92 సెంట్లు మాత్రమే ఉన్నట్లు ఉందని పేర్కొన్నారు. మొత్తం మీద 10 సెంట్ల భూమిని కోల్పోతున్నామని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

సంతకవిటి: మండలంలోని బొద్దూరు గ్రామంలో మేము సైతం యువజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు సోమవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో బొద్దూరు, మామిడిపల్లి, సిరిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు నిలవగా, రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలను బహుమతులుగా వారికి అందజేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలో రెండు దత్తత కుటుంబాలకు అదే గ్రామానికి చెందిన యువజన సంఘం సభ్యులు.. నిత్యావసర సరుకులు సోమవారం పంపిణీ చేశారు. కుటుంబ పెద్దను కోల్పోయి, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పెదపూడి ఇందుమతి, వడ్డి రాజులుకు నెలకు సరిపడ సరుకులతో పాటు సంక్రాంతి సందర్భంగా నూతన వస్త్రాలు అందించారు. కార్యక్రమంలో శివరామాంజనేయ యువజన సంఘం సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, జి.సత్యనారాయణ, ఎం.రామకృష్ణ, బి.భాస్కరరావు, జి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

రాజాం: సంక్రాంతి పండగ వేళ.. కోడిపందాలు, పేకాట శిబిరాలు, పొట్టేళ్ల పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర హెచ్చరించారు. ఇదే విషయమై ఆయన స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఎక్కడైనా అట్టాట, పేకాట శిబిరాలు నిర్వహించినా, పందాలు ఆడుతున్నా సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రశాంత వాతావరణంలో అందరూ పండగ చేసుకోవాలని, అవాంఛనీయ ఘటనలకు పాల్పడవద్దని తెలిపారు.

ఘనంగా గోదాదేవి కల్యాణోత్సవం

సంతకవిటి: మండలంలోని మిర్తివలస గ్రామంలో శ్రీసంపత్ వేంకటేశ్వరాలయంలో గోదాదేవి కల్యాణోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. భోగి పండగ సందర్భంగా ఈ కార్యక్రమం అట్టహాసంగా చేపట్టినట్లు ఆలయ ప్రధానార్చకుడు పార్థసారథి తెలిపారు.